క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని రూపాబాయమ్మ ట్రస్ట్ బోర్డు మెంబర్ గట్ల మహేందర్‌రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేత



పాయకాపురం(విజయవాడరూరల్): ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసే కార్యక్రమం గురువారం జరిగింది. ప్లాస్టిక్‌ను నివారించడం, ఈ వేస్ట్‌ను తగ్గించడం, నీటిని సంరక్షించి మొక్కలను నాటడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం అనే అంశాలపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో మొదటి ఐదు స్థానాలు సాధించిన విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మైనం హుస్సేన్ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తమ ఇంటి ఆవరణలో మొక్కను నాటడంతో పాటు సంరక్షించాలని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

500 మందికి అన్నప్రసాద వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. బాబాకు ప్రీతికరమైన రోజు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నర్తన నటరాజ నాట్యాలయంకు చెందిన పలువురు చిన్నారులు గురువారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కళాబృందానికి చెందిన చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

దక్షిణామూర్తికి విశేష పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామివారి ఆలయం వద్ద దక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయానికి దక్షిణం వైపుగా ఉన్న దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం పూజలు నిర్వహించగా, ఆలయ ఈఓ కెఎస్.రామరావు పాల్గొన్నారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.

7న వరంగల్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నున్న(విజయవాడరూరల్): వచ్చే నెల 7వ తేదీన వరంగల్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద వెంకటేశ్వరావు మాదిగ విజ్ఞప్తి చేశారు. నున్న గ్రామం సీఎస్ఐ చర్చి కాంపౌండ్ వద్ద గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల సమావేశానికి ముఖ్య అతిథిగా వెంకటేశ్వరరావు మాదిగ విచ్చేసి మాట్లాడారు. జూలై 7న వరంగల్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో మాదిగ ఆత్మ గౌరవ కవాతు, బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. ఈ సభకు ప్రతి మాదిగ కుటుంబం తరలిరావాలని పిలుపునిచ్చారు.

● డ్రెయిన్లలో పూడిక తొలగింపు









వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. నగరంలోని డ్రెయిన్లలో పూడికతీత తొలగింపు చేపట్టారు. కాల్వల్లో మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీనిపై నగర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బందరు రోడ్డులో పారిశుద్ధ్య కార్మికులు ఎంతో శ్రమించి కాల్వల్లో పూడిక తీస్తున్న చిత్రాలివి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం విద్యుత్ సబ్ స్టేషన్ దాసాంజనేయ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరం బీఆర్‌టీఎస్ రోడ్డు, కాన్సర్ హాస్పిటల్ ఏరియా, నార్లవారి వీధి, కుటుంబరావు వీధి, బుల్లెమ్మ వీధి, కాటూరివారి వీధి, దానయ్య వీధి, పోతినేనివారి వీధి, అక్కుళ్ల తాతయ్య వీధి, దుగ్గిరాల బలరామకృష్ణయ్య వీధి, మాచవరం రైవస్ కాలువ కట్ట ఏరియా, పడవలరేవు బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయం మధ్య ప్రాంతం, ఏలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. అలాగే గుణదల పడవలరేవు ఏరియా, పిచ్చమ్మ తల్లి గుడి మొత్తం ఏరియా, మాచవరం రెవెన్యూ కాలనీ అన్ని లైన్‌లు, మాచవరం గ్రంథాలయం ఏరియా, మాచవరం డౌన్ కొండవైపు ఏలూరు రోడ్డు ఏరియా, కార్మికనగర్ కొండ ప్రాంతం మొత్తం, యారంవారి వీధి, యెలిశేలవారి వీధి, వాటర్ ట్యాంక్ రోడ్, ప్రతిభానికేతన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.



చిలుకల ప్రేమ కలాపం

యనమలకుదురు సమీపంలో తాటి చెట్లలో చిలుకలు గూళ్లు ఏర్పాటు చేసుకున్నాయి. ఈ గూళ్లలో చిలుకల ప్రేమ కలాపాన్ని గురువారం సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పీఓడబ్ల్యూ సభను జయప్రదం చేయాలి

పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు గంగా భవాని

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రగతిశీల మహిళా సమాఖ్య (పీఓడబ్ల్యూ) ఏర్పడి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా అర్ధ శతాబ్ది వార్షికోత్సవ సభను ఈ నెల 22వ తేదీ విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు గంగా భవానీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో మహిళా జర్నలిస్టు సి.వనజ, పీఓడబ్ల్యూ రాష్ట్ర కమిటీ మాజీ అధ్యక్షురాలు సంధ్య, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తదితరులు హాజరై మహిళల సమస్యలపై మాట్లాడతారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1974 ఉస్మానియా విద్యార్థుల చొరవతో అభ్యుదయ మహిళా సంఘం ఏర్పడిందని ఆ స్ఫూర్తితోనే ప్రగతిశీల మహిళా సమాఖ్య ఏర్పడి రెండు తెలుగు రాష్ట్రాల్లో మహిళా సమస్యలపై పోరాడుతోందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో పేద ప్రజల నివాస హక్కుల కోసం జరిగిన పోరాటాల్లో, మతోన్మాదానికి వ్యతిరేకంగా మహిళలను సంఘటిత పరచడంలో, మహిళలపై అత్యాచారం, కుటుంబ హింస, లైంగిక వేధింపులు నిరోధక చట్టాల రూపకల్పనలో తమ సమాఖ్య భాగస్వామ్యం వహించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలకులు సాగిస్తున్న ఫాసిస్టు నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూ సాగుతున్న ఉద్యమాల్లో తమ సంఘం భాగస్వామ్యం అయిందని తెలియజేశారు. ఇటీవల మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన అత్యాచారాలకు వ్యతిరేకంగా, మహిళ మల్లయోధులపై బీజేపీ ఎంపీ చేసిన లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో, బిల్కిస్ భాను పోరాటానికి తమ సమాఖ్య మద్దతుగా ఆందోళనలు నిర్వహించిందని వివరించారు. మహిళా సమస్యలపై మరింత చర్చించి భవిష్యత్ ఆందోళనలపై ఈ సభలో చర్చిస్తామని పేర్కొన్నారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేం చేసిన పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామివార్ల దేవస్థాన త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు తెలిపారు. దేవస్థాన ఆవరణలోని కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్రహ్మోత్సవాల వివరాలను పాలక మండలి వివరించింది. ఉత్సవాలను టీటీడీ వేద పాఠశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మురికిపూడి మణిదీప్‌కుమార్, ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు శ్రీనివాసుని గోపాల్ పర్యవేక్షణలో నిర్వహించనున్నామని చెప్పారు. 5 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో తొలి రోజున స్వామి వారికి మంగళస్నానాలు, నూతన వధూవరులుగా అలంకరణ చేస్తామని పేర్కొన్నారు. రెండో రోజులు హోమాలు, నవగ్రహ ఆరాధన, సహస్ర దీపాలంకరణ సేవ జరుగుతుందన్నారు. 23వ తేదీ స్వామి వారి కల్యాణోత్సవం, 24వ తేదీ స్వామి వారికి పుష్పయాగం, సాయంత్రం నగరోత్సవ సేవ ఉంటుందని చెప్పారు. 25వ తేదీ శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రధాన మూర్తికి పంచామృత అభిషేకాలు, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. సాయంత్రం పవళింపు సేవ జరుగుతుందన్నారు. స్వామి వారికి నిర్వహించే విశేష పజలు, అభిషేకాలు, అర్చనలో పాల్గొనాల్సిందిగా భక్తులందరికీ ఆహ్వానం పలుకుతున్నామన్నారు. సమావేశంలో కమిటీ కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు బెవర సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, పొట్నూరి రాజా, పిల్లా విజయ్ పాల్గొన్నారు.

సంతృప్తినిచ్చే సేవలు అందించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): తటవర్తి వరలక్ష్మి సూర్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఐదుగురు దివ్యాంగులు (విభిన్న ప్రతిభావంతులు)కు అవసరమైన ట్రై సైకిళ్లు, కృత్రిమ అవయవాలను అందజేయడం అభినందనీయమని పలువురు లయన్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. విజయవాడలోని ట్రస్ట్ కార్యాలయంలో గురువారం ట్రై సైకిళ్లతోపాటు 20 మందికి వినికిడి మిషన్లు వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా లయన్స్ జిల్లా గవర్నర్ జెఎస్ శంకర్ గుప్తా, లయన్స్ డిజిగ్నేటెడ్ అంబాసిడర్ వేములహజరత్తయ్య గుప్తా, మాజీ గవర్నర్ దుర్గామల్లేశ్వరరావు పాల్గొని ట్రస్ట్ సేవలను కొనియాడారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె. రామలింగేశ్వరరావు, రవీంద్ర కుమార్ మాట్లాడుతూ దాత, విలాస్ బనియన్స్ అధినేత తటవర్తి సూర్యనారాయణ అందిస్తున్న సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ తాను వాసవి క్లబ్ జిల్లా గవర్నర్‌గా పని చేసినప్పుడు 108 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు తయారు చేయించి ఇచ్చినప్పుడు వారి కళ్లల్లో కనిపించిన ఆనందం నేటికీ మరిచిపోలేనిదన్నారు. మనం చేసే సేవలు లబ్ధిదారులకు ఉపయోగపడటమే కాకుండా సంతృప్తినిచ్చేదై ఉండాలని పేర్కొన్నారు. ట్రస్ట్ సభ్యులు చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదలకు, దివ్యాంగులకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తద్వారా వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండటం కంటే ఇంకా ఏం కావాలని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కొత్తమాసు రామ్ కుమార్, ఐ నాగేశ్వరరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి ఈఓ, ఏఈఓల మధ్య వాగ్వాదం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈఓ కెఎస్.రామరావు, ఏఈఓ సుధారాణిల మధ్య గురువారం వాగ్వాదం చోటు చేసుకుంది. ఉదయం హుండీ లెక్కింపు సమయంలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలయంలో చర్చనీయాంశంగా మారింది. అమ్మవారి బంగారు ఆభరణాలను మహా మండపం 7వ అంతస్తులోని ఎస్‌పీఎఫ్ సిబ్బంది కార్యాలయం సమీపంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తారు. ఇటీవల బంగారు ఆభరణాలను పూర్వ ఈఓ నుంచి అప్పగించుకునే క్రమంలో తూకంలో వ్యత్యాసం ఉందంటూ ఏఈఓ సుధారాణి పేర్కొంటున్నారు. దీనిపై ఏఈఓ సుధారాణి ఈఓకు, దేవదాయ శాఖ ముఖ్య అధికారులకు లేఖ రాయడమే ఈ వివాదానికి కారణంగా తెలుస్తోంది. ఈ లేఖను గురువారం ఈఓ రామరావుకు లేఖ ఇవ్వడమే కాకుండా దాని కాపీలను దేవదాయ శాఖ అధికారులకు పంపుతున్నట్లు ఉంది. దీనిపై ఎక్కడ లోపం జరిగిందనే దానిని గుర్తించిన తర్వాతే కమిషనర్ కార్యాలయానికి తెలియజేస్తే బాగుంటుందని ఈఓ పేర్కొనడంతో ఇద్దరి మధ్య వాదన చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది.

ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



పి సౌజన్య



ఎం ధాత్రి దీపిక

లబ్బీపేట(విజయవాడ తూర్పు):ఏపీ పీజీ-ఇసెట్ 2023-24 ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. 41 మంది ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. తమ విద్యార్థులు పి. సౌజన్య 8వ ర్యాంకు, ఎం ధాత్రి దీపిక 15వ ర్యాంకుతో పాటు, వందలోపు నలుగురు, మొత్తం 41 మంది ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు , కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ అభినందనలు తెలిపినట్లు పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గాంధీజీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమణశ్రీ అన్నారు. ఆ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం పాతబస్తీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమణశ్రీ మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. యోగా భారతీయుల సొంతమైన పురాతన ప్రక్రియగా పేర్కొన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా యోగాను ఆచరించి అనేక మేలును పొందుతున్నారని చెప్పారు. యోగాను విద్యార్థులు నిత్యం సాధన చేయడం ద్వారా అన్ని విధాలుగా విజయాలను సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు కేవీ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలు భక్తులకు చేరువ కావాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ప్రతి నిత్యం జరుగుతున్న ఆర్జిత సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు మరింత చేరువ కావాలని ఈఓ కెఎస్.రామరావు ఆదేశించారు. దుర్గగుడి ఐటీ వింగ్, 9అండ్9 సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అమ్మవారికి ప్రతి నిత్యం జరిగే అన్ని రకాల ఆర్జిత సేవలు, పరోక్ష సేవలపై భక్తులకు అవగాహన కల్పించడంతో పాటు వాటిని భక్తులకు చేరువ చేసేలా డిజిటల్ మార్కెటింగ్, ఇతర ప్రచార సాధనాలను ఉపయోగించాలని సూచించారు. అనంతరం దేవస్థానం సోషల్ మీడియాలో మరింత చురుగ్గా ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఐటీ సిబ్బంది హరీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలి



అంబేడ్కర్ స్ఫూర్తి సభలో మాట్లాడుతున్న దేవిడ్‌రాజు, వేదికమీద వీరభద్రరావు తదితరులు

విజయవాడకల్చరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద గురువారం అంబేడ్కర్ స్ఫూర్తి సభ, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన డేవిడ్‌రాజు మాట్లాడుతూ భారత జాతిని ప్రగతి పథం వైపు నడిపించిన మహనీయుడు అంబేడ్కర్ అని అభివర్ణించారు. స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. విశ్రాంత ఐఓసీ అధికారి బీవీ వీరభద్రరావు మాట్లాడుతూ అంబేడ్కర్ సాంస్కృతిక సంస్థ ద్వారా యువత భవిష్యత్‌కు వర్క్ షాపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, మాంతి రమణ, మారేపల్లి జోషి, పరచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్ ప్రసంగించారు. ప్రమీలా రాణి, మల్లీశ్వరి, శ్యాం ప్రసాద్ కృష్ణ సింధూతో పాటు పలువురు గాయనీ గాయకులు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అంబేడ్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్‌పై పరిశోధనలు విస్తృతం కావాలి



విద్యార్థులకు రీసెర్చి గ్రాంట్ అందజేస్తున్న న్యూయార్క్ కళాశాల ప్రతినిధులు, ప్రిన్సిపాల్

గన్నవరం రూరల్: పబ్లిక్ హెల్త్‌పై విద్యార్థులు విస్తృత పరిశోధనలు చేయాలని న్యూయార్క్‌కు చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రతినిధులు గేల్ గిబ్బన్ గేయిల్, మిచెల్ స్టీవెన్, కోర్ ఇన్నిస్, సైమన్ సూచించారు. చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ డెంటల్ కళాశాలలో దంత వైద్య విద్యార్థులకు హెల్త్ ఇన్ఫర్మేటిక్స్, హెల్త్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సులపై గురువారం జరిగిన సదస్సులో అవగాహన కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా పబ్లిక్ హెల్త్ కాపాడటంలో విద్యార్థి దశ నుంచే పరిశోధనలు విస్తృతం కావాలని ఆకాంక్షించారు. దీనికి తమ కళాశాలలో అపూర్వ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలకు, న్యూయార్క్ సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలకు ఎంవోయూ కుదిరినట్లు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ రామోజీరావు తెలిపారు. ఈ సందర్భంగా పరిశోధన పత్రాలు సమర్పించిన 15 మంది విద్యార్థులకు, గైడ్‌లుగా వ్యవహరించిన హెచ్‌వోడీలు, అధ్యాపకులకు అతిథులు రీసెర్చి గ్రాంట్ అందజేశారు. డెంటల్ ఎడ్యుకేషన్ కన్వీనర్ డాక్టర్ కె.అజయ్‌బెనర్జీ, హెచ్‌వోడీలు రవిచంద్ర, ఎ.కాశేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీహర్ష, జీఎం నాయుడు, ప్రభాత్, సునీల్ చంద్ర, కిరణ్‌కుమార్, సురేష్, ఏవో వై.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. అతిథులకు కళాశాల యాజమాన్యం మొమెంటోలను అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించింది.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలు, యోగా షెడ్యూల్ పోస్టర్స్ ఆవిష్కరణ



పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, కె. భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించ తలపెట్టిన ఆన్‌లైన్ క్విజ్ పోటీలు, యోగా షెడ్యూల్ పోస్టర్స్‌ను గురువారం కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శోభన్‌బాబు మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాకిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొండా

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 63వ డివిజన్ రాజీవ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్, 64వ డివిజన్ కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు గురువారం విద్యా కిట్లు పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్స్, షూస్, సాక్స్, టై, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించి విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని సూచించారు. కార్యక్రమాల్లో హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, కెవి.దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, స్థానిక టీడీపీ నాయకులు ఎల్.వైకుంఠం, ఎల్.దుర్గా, మాజీ కార్పొరేటర్ పైడి తులసి, పరసా అశోక్, పి.భాగ్యలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగాపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు

పాయకాపురం(విజయవాడరూరల్): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 6.30 గంటలకు రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో యోగా వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని సంస్థ అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయూష్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత రోజుల్లో జీవనశైలి మారడం వల్ల అనేక వ్యాధులను ప్రజల్లో గమనిస్తున్నట్లు పేర్కొన్నారు. నిద్రలేమి, ఆందోళన, ఏకాగ్రత లోపించడం, తొందరగా కోపోద్రికులు కావడం, తల నొప్పి మొదలగు ఆరోగ్య సమస్యలకు యోగాతో ఉపశమనం కలుగుతుందని చెప్పారు. మన దైనందిన కార్యక్రమాల్లో యోగాను ఒక భాగంగా స్వీకరించడం ద్వారా అనేక శారీరక, మానసిక రుగ్మతల నుంచి ఉపశమనం కలుగుతుందని అన్నారు. వివిధ వ్యాధుల్లో యోగా యొక్క ప్రాముఖ్యతను గురించి ప్రజలకు వివరించడం, అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పరిశోధన అధికారి డాక్టర్ ఏజేవీ సాయిప్రసాద్, సంస్థ అధికారులు పాల్గొన్నారు.